నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 మహబూబ్‌నగర్, బుధవారం 31 జనవరి 2024 NAGARKURNOOL




గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

## ప్రపంచశాంతికి మార్గదర్శి గాంధీ

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జనవరి 30 : ప్రపంచశాంతికి మార్గదర్శి మహాత్మాగాంధీ అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. దేశానికి అహింసా మార్గంలో స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ప్రదాత గాంధీజీ అని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలపేటలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ తన చివరి శ్వాస వరకు శాంతి, అహింసా మార్గాలను ప్రచారం చేశాడన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప మహనీయుడన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన వ్యక్తి అని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నాయకుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మునగాలలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల, జనవరి 30 : కేసీఆర్ పాలనలోనే గ్రామాలాభివృద్ధి జరిగిందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. మండలంలోని మునగాలలో ఉపాధిహామీ పథకం కింద రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, రూ.5 లక్షలతో నిర్మిస్తున్న షాదీఖాన భవన నిర్మాణానికి మంగళ వారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీతో పాటు షాదీఖాన నిర్మాణానికి సర్పంచ్ కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి స్థలం ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, సుంకన్న, ఈదన్న, నాయకులు శేఖర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## చివరి శ్వాస వరకు మక్తల్‌వాసుల వెంటే..

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి
- ఘనంగా రామన్న జన్మదిన వేడుకలు

మక్తల్ టౌన్, జనవరి 30 : రాజకీయంలో గెలిచినా.. ఓడినా.. నిరంతరం మక్తల్ ప్రజల వెన్నంటే తన చివరి శ్వాస వరకు ఉంటూ తపిస్తానని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళ వారం రామన్న జన్మదినం సందర్భంగా చిట్టెం దంపతులు మక్తల్ పడమటి అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయం అనేది ఎప్పటికీ ఉండేదేనన్నారు. రాజకీయంలో ఓటమి, గెలుపు వస్తూ పోతూ.. ఉంటాయని కార్యకర్తలకు సూచించారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి 18 ఏండ్ల నుంచి ఇక్కడి ప్రజలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలను సొంతం చేసుకోవడం పునర్జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. అధికారంలో లేకపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు, తనను నమ్ముకున్న కార్యకర్తలకు వెన్నంటే ఉండి వారి యోగక్షేమాలను నిరంతరం చూసుకుంటానన్నారు. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటున్న తనకు స్థానిక ప్రజలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఇంతటి ప్రేమాభిమానాలు చూపించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అలాగే రామన్న బర్త్‌డే సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభిమానులు, నాయకులు అభిమానాన్ని చాటుకున్నారు. భారీ సంఖ్యలో పట్టణానికి తరలొచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు : ఇద్దరు మృతి



వడ్డె బాలరాజు, ప్రభాకర్ (ఫైల్)

మక్తల్ టౌన్, జనవరి 30 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మక్తల్ మండలం కాచ్‌వార్ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు కాచ్‌వార్‌కు చెందిన ప్రభాకర్, మక్తల్ పట్టణానికి చెందిన వడ్డె బాలరాజు బైక్‌పై మక్తల్ నుంచి కాచ్‌వార్‌లోని వారి పొలం వద్దకు వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకర్, బాలరాజు తీవ్రంగా గాయపడగా వారిని మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంపై ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డిని వివరణ కోరగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమేనని, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల పరస్పర దాడులు

గద్వాల అర్బన్, జనవరి 30 : గద్వాల, మహబూబ్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్లు పరస్పర దాడులు చేసుకున్న ఘటన మంగళవారం జిల్లా కేంద్ర సమీపంలోని జమ్మిచేడు వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు మహబూబ్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్లు గద్వాల ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నారని, వారు ఈ ప్రాంతంలో భిక్షాటన చేయకూడదంటూ గద్వాలకు చెందిన ట్రాన్స్‌జెండర్లు అడ్డుకొన్నారు. ఈ విషయంలో ఇరుపక్షాల వారు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న గద్వాల రూ రల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వారిని నిలువరించి.. గాయపడిన వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం తమపై దాడిని చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గద్వాల ట్రాన్స్‌జెండర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తగ్గిన వేరుశనగ ధరలు

జడ్చర్ల, జనవరి 30 : బాదేపల్లి మార్కెట్‌లో వేరుశనగ ధరలు మంగళవారం తగ్గాయి. సోమవారం రూ.200 పెరగగా మంగళవారం రూ.80 వరకు తగ్గాయి. కందులకు కూడా క్వింటాకు రూ.90 తగ్గాయి. మంగళవారం మార్కెట్‌లో వేరుశనగకు అత్యధికంగా క్వింటా రూ.7,307 ధర పలికింది. ప్రధానంగా మార్కెట్‌కు 4,784 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,307, కనిష్ఠంగా రూ.3,782, మధ్యస్థంగా రూ.6,689 ధర పలికింది. అదేవిధంగా 81క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా గరిష్ఠంగా రూ.9,756, కనిష్ఠంగా రూ.9,259, మధ్యస్థంగా రూ.9,756 ధర లభించింది. అలాగే ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,991, జొన్నలకు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,511, బెబ్బర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.6,579, మొక్కజొన్నకు క్వింటాకు గరిష్ఠంగా రూ.1,921 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## 21 మంది ఎస్సైల బదిలీ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ/గద్వాల రూరల్, జనవరి 30: జోగుళాంబ గద్వాల జోన్ పరిధిలో 21 మంది ఎస్సైలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీఐజీ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున పోలీస్ బదిలీలు జరగడం విశేషం. ఎస్సై హరిప్రసాద్ పెద్దమందడి పీఎస్ నుంచి గోపాల్‌పేట పీఎస్‌కు బదిలీ కాగా, ఎస్‌కే శంషుద్దీన్ ట్రాఫిక్ మహబూబ్‌నగర్ నుంచి శ్రీరంగాపూర్‌కు, వెంకటస్వామి శ్రీరంగాపూర్ నుంచి వీఆర్ మహబూబ్‌నగర్‌కు, వీ వెంకటేశ్వర్లు గోపాల్‌పేట నుంచి వీఆర్ వనపర్తికి, వీ జయన్న ఎస్సై-2 వనపర్తి నుంచి ఎస్సై వనపర్తి టౌన్‌కు, జీ యుగేంధర్ ఎస్సై వనపర్తి వీఆర్ వనపర్తికి, ఈ శివకుమార్ రేవల్లి పీఎస్ నుంచి పెద్దమందడికి, పీ.జలేందర్‌రెడ్డి డీఎస్బీ వనపర్తి నుంచి వనపర్తి రూరల్‌కు, కర్రి శేఖర్‌రెడ్డి బల్మూర్ పీఎస్ నుంచి రేవల్లికి, ఎం.చంద్రకాంత్ వీఆర్ మహబూబ్‌నగర్ నుంచి మానవపాడు పీఎస్ గద్వాల జిల్లా, కొండూర్ రాము మానవపాడు నుంచి డీఎస్బీ గద్వాలకు, జగదీశ్వర్‌రెడ్డి పెబ్బేర్ నుంచి వీఆర్ గద్వాల జిల్లాకు, ఎంఏ ఖాదర్ వీఆర్ గద్వాల డీఎస్బీ గద్వాల జిల్లాకు, ఎం.సంతోష్ వీఆర్ వనపర్తి నుంచి శాంతినగర్‌కు బదిలీ అయ్యారు. వీ.వెంకటేశ్ కేటీదొడ్డి నుంచి ఇటిక్యాలకు, అశోక్‌బాబు ఇటిక్యాల నుంచి వీఆర్ మహబూబ్‌నగర్‌కు, సీ.కురుమయ్య నర్వ నుంచి కోదండాపూర్‌కు, పీ.కృష్ణదేవ్ కోదండాపూర్ నుంచి వీఆర్ నారాయణపేటకు, ఏ.నాగరాజు డీసీఆర్‌బీ మహబూబ్‌నగర్ నుంచి అలంపూర్‌కు, ఏ.రమేశ్ అలంపూర్ నుంచి డీఎస్బీ గద్వాలకు, కే.శ్రీనివాసులు మూసాపేట నుంచి ఉండవెల్లి పీఎస్‌కు బదిలీ అయ్యారు.





ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# పాలమూరు అభివృద్ధికి అహర్నిశలు పనిచేశా..

- పనులను వివరించడంలో విఫలమయ్యాం..
- తప్పుడు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- గత ఎన్నికల్లోని పొరపాట్లను సరిచేసుకొని ముందుకు సాగాలి
- పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు కలిసి పనిచేద్దాం..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 30 : మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కష్టపడి పనిచేశానని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు చేప్పుకోలేకపోయామని.. తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలు నెరవేర్చడంలో విఫలమైందని, పక్కనున్న కర్ణాటకలో కూడా ఇలాగే కొనసాగుతుందని విమర్శించారు. గ్రామాల్లో రైతుబంధు, పింఛన్లు అందడం లేదని, వ్యవసాయానికి పూర్తిస్థాయిలో కరెంటు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించలేదన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా నియోజకవర్గ ప్రజలకు రూ.30 కోట్లు అందించి ఆదుకున్నామని, మైనార్టీ పిల్లల చదువు కోసం రూ.120 కోట్లతో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. పేదల కోసం పట్టణంలో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణంలో ఉందన్నారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయని ఇది రాష్ట్రంలో ఎక్కడా జరగలేదన్నారు. ప్రజలకు ఐదేండ్లు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి చక్కటి సేవలు అందించారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని, గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిచేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పని చేసేవారికి భవిష్యత్తులో మంచి స్థాయి ఉంటుందన్న విషయాన్ని గుర్తించుకొని పనిచేయాలని సూచించారు. ప్రజల కష్టాలను కాంగ్రెస్ పార్టీ గాలికి వదిలేసిందని, రైతులు వ్యవసాయం వదిలేసి వలసల దారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిం దని, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని కమిటీల పేరుతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. అంతకుముందు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, ఎంపీపీ సుధా శ్రీ, హన్వాడ ఎంపీపీ బాలరాజు, మార్కెట్ కమిటీ చైర్మ న్ రెహమాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కరుణాకర్‌గౌడ్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

# కందనూలు ప్రగతికి కృషి చేయాలి

- అధికారులు,ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్నమ ంత్రిజూ పల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జనవరి 30 : కందనూలు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్‌హాల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరయ్యారు. నీటి పారుదల, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ప్రొహిబిషన్, ఎక్సైజ్, అటవీశాఖ, విద్యుత్, విద్య, వైద్యం, గనులు, భూగర్భ ఖనిజాలు, వ్యవసాయంతోపాటు పలు శాఖల పనితీరుపై సభలో చర్చించారు. విద్యాశాఖపై చర్చ సందర్భంగా మంత్రి కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సహకారంతో గ్రామానికో గురుకుల పాఠశాల స్థాయి విద్యను సర్కారు స్కూళ్లల్లోనే అందించవచ్చన్నారు. ప్రజాప్రతినిధులకు వచ్చే నిధులు, కలెక్టర్ నుంచి కొంత నిధులతో మిగిలినవి చందా వసూలు చేసి ప్రతి జీపీలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనంగా ప్రైవేట్‌గా టీచర్లను నియమించి శారీరక వ్యాయామం, విద్యను అందించాలని ఆదేశించారు. వైద్యానికి తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన్ననూర్ నుంచి వటువర్లపల్లి వరకు ఉన్న విద్యుత్‌కేబుల్ వేలాడుతూ చాలాచోట్ల తీగలు తెలిపోయి షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా కొత్తగా కేబుల్ మార్చడానికి ఎంత అవసరమన్న ప్రతిపాదనలు పంపించాలని అధికారిని ఆదేశించారు. వారం రోజుల తర్వాత విద్యుత్‌శాఖపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పలు శాఖలకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తగా పరిష్కారాలు చూపించారు. అచ్చంపేట నుంచి మద్దిమడుగు వరకు ఒకే లైన్‌పై 5 సబ్‌స్టేషన్లు ఉండడంతో లోవోల్టేజీ సమస్య ఏర్పడుతున్నదని వివరించారు. గ్రామాలు, పట్టణాల్లో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను మార్చడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 200 యూనిట్ల వరకు వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను క్రమంగా నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత బానిసై వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన అందరికీ హక్కు పత్రాలు జారీ చేయాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ ప్రకారం ఇది నిరంతర ప్రక్రియ అని, సరైన ఆధారాలు చూపించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అమ్రాబాద్ ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నదని, ప్రైవేట్‌గా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అనంతరం పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో సర్పంచులు పనులు పూర్తి చేసినా ఎంబీ రికార్డులు చేయడం లేదని సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 30 : పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి చిదిరె సాయితేజ(19) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు సతీశ్‌కుమార్ పెద్ద కుమారుడు సాయితేజ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో ఈనెల 26వ తేదీన ఇబ్రహీంపట్నం వద్ద మరో బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సాయితేజ అవయవాలను కుటుంబ సభ్యులు దవాఖానకు దానం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.



బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్న చెంచులు

## చెంచు కాలనీలో నీటి ఎద్దడి

- పొలాల్లోని బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్న చెంచులు
- వారమైనా పట్టించుకోని అధికారులు

లింగాల, జనవరి 30 : మండలంలోని పద్మన్నపల్లి గ్రామ చెంచు కాలనీలో వారం రోజులుగా తాగునీరు లేక చెంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం కిందట కాలనీలో ఉన్న బోరు మోటరు కాలిపోయినట్లు వీటీడీఏ అధ్యక్షుడు సలేశ్వరం తెలిపారు. ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి విన్నవించినా పట్టించుకోవడం లేదని చెంచులు వాపోతున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రతి రోజూ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. వ్యవసాయ పొలాల్లో ఉన్న నీటిని తాగుతూ అనారోగ్యం పాలై దవాఖానకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న తమకు వ్యవసాయ పనులకు వెళ్దామంటే నీటిని తెచ్చువకోవడానికే టైం సరిపోతుందని ఆవేదన వ్య క్తం చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు చొరవ తీసుకొని కాలిపోయిన బోరు మోటరుకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని చెంచులు కోరుతున్నారు.

## జాతీయ సదస్సుకు హెచ్‌ఎం ఎంపిక



మురళీకృష్ణ, హెచ్‌ఎం

కొత్తకోట, జనవరి 30 : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో పండిట్ సుందర్‌లాల్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1,2వ తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయ విద్యావేత్తల సదస్సుకు మండలంలోని రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈ సదస్సులో మురళీకృష్ణ వెదురుతో చేసిన బొమ్మలు, బోధనోపకరణాలు, ఆటలను పాఠశాల స్థాయిలో ఏ విధంగా ప్రవేశపెట్టి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని అందజేయనున్నారు. ఈ సదస్సుకు ఎంపికైనందున కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఈవో గోవిందరాజులు హెచ్‌ఎం మురళీకృష్ణను అభినందించారు.



సోమవారం సీజ్ చేసిన ఇసుక డంపులు, మంగళవారం ఖాళీ అయిన ఇసుక

# ఇసుక మాయం..!

- సీజ్ చేసిన ఇసుక డంపులు ఎక్కడ..?
- అక్రమ రవాణాపై చర్యలేవీ..?

రాజోళి, జనవరి 30 : మండల కేంద్రంలో సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు రాత్రికి రాత్రే మాయమైంది. స్థానికులు ఇసుక అక్రమ రవాణాపై సోమవారం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని 24 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేసి పంచనామా చేశారు. అయితే సీజ్ చేసిన ఇసుకను సోమవారం రాత్రి మినీ టిప్పర్లతో అక్రమార్కులు తరలించడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇసుక అక్రమార్కులకు అధికారులు అండగా ఉండడంతోనే ఈ పని జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విచారణ నిర్వహించాలని కోరుతున్నారు. సీజ్ చేసిన ఇసుక తరలింపుపై తాసీల్దార్ శ్రీనివాస్‌శర్మను వివరణ కోరగా సిబ్బంది లేకపోవడంతో డంపులకు భద్రత కల్పించలేక పోయామని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేసేందుకు లెటర్ రెడీ చేసి జిల్లా అధికారులకు సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. అయితే ఇసుక అక్రమార్కులు అధికారుల అండదండలతో చెలరేగి పోతున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.